చట్టం అధికార పార్టీ చుట్టమా?

- అసెంబ్లీలో వారికో చట్టం.. మాకో చట్టమా?
- అసెంబ్లీ సాక్షిగా బట్టలిప్పి కొడతానన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రూల్స్ వర్తించవా?
- ఒక సీఎం అలా మాట్లాడుతుంటే అభ్యంతరం ఎందుకు చెప్పలేదు?
- బయట అంతా ఫోర్త్ సిటీ, బ్రదర్స్ సిటీ అంటున్నారని చెప్పడంలో తప్పేముంది?
- ఎమ్మెల్సీ శంభీపూర్ ఫైర్
- ఎమ్మెల్సీ, శాసనమండలి చైర్మన్ మధ్య తీవ్రవాగ్వాదం
- బదులిచ్చేందుకు తడబడ్డ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్, మార్చి 18(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వంపై శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నిప్పులు చెరిగారు. 'చట్టం అధికార పార్టీ చుట్టమైందా?' అంటూ మండలి చైర్మన్‌ను నిలదీశారు. 'అసెంబ్లీలో వారికో చట్టం.. మాకో చట్టమా?' అంటూ ఫైర్ అయ్యారు. 'అసెంబ్లీ సాక్షిగా బట్టలిప్పికొడతానన్న సీఎంకు రూల్స్ వర్తించవా' అని ప్రశ్నించారు. సీఎం అసెంబ్లీలో అలా మాట్లాడుతుంటే ఎందుకు అభ్యంతరం చెప్పలేదని నిలదీశారు. మంగళవారం ఫ్యూచర్ సిటీపై చర్చలో శంభీపూర్ రాజు ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రశ్నలతో మంత్రులను ఉక్కిరిబిక్కిరి చేశారు.

శంభీపూర్ వర్సెస్ చైర్మన్

మండలిలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు వర్సెస్ మండలి చైర్మన్ ఎపిసోడ్ కొనసాగింది. ఒక్కసారిగా మండలి వాతావరణం వేడెక్కింది. ఫోర్త్ సిటీపై ప్రశ్నల్లో భాగంగా శంభీపూర్ రాజు మాట్లాడుతూ 'సారేమో (చైర్మన్) ఫ్యూచర్ సిటీ అంటున్నారు. కానీ బటయ అందరూ ఫోర్త్ సిటీ అని, బ్రదర్స్ సిటీ అని అంటున్నారు. పేపర్లలో కూడా వస్తున్నాయి' అని అన్నారు. శంభీపూర్ రాజు బ్రదర్స్ సిటీ అనడంపై కాంగ్రెస్ సభ్యులు, మంత్రులు అభ్యంతరం వ్యక్తంచేశారు. అంతలోనే కల్పించుకున్న చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ' రాజు అన్‌వాంటెడ్ కామెంట్స్ చేయొద్దు.. డిలీట్ చేస్తా' అని అనడంతో రాజు స్పందిస్తూ తాను సీఎం పేరు ప్రస్తావించలేదని సమాధానిమిచ్చారు. అదే విధంగా 'సార్.. అసెంబ్లీలో బట్టలిప్పికొడతా అన్న వాళ్లకేమో రూల్స్ వర్తించవు.. మాకు మాత్రం రూల్స్ వర్తిస్తాయా?' అంటూ ప్రశ్నించారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ 'ఈ హౌస్‌లో మాత్రమే మాట్లాడండి.. బయట హౌస్ గురించి మాట్లాడొద్దు' అని వారించారు. దీనిపై ఎమ్మెల్సీ స్పందిసూ 'నేను ఎవరి పేరూ తీసుకోకుండా మాట్లాడితే.. అభ్యంతరం ఎలా వ్యక్తం చేస్తారు? వారికో చట్టం.. మాకో చట్టమా? చట్టం అధికార పార్టీ చుట్టమైందా? మాకు మాత్రమే రూల్స్ వర్తిస్తాయా?' అంటూ ప్రశ్నించారు. మళ్లీ చైర్మన్ స్పందిస్తూ 'అవన్నీ బయట మాట్లాడుకోండి.. హౌస్‌లో కాదు' అంటూ వారించారు. దీనిపై ఎమ్మెల్సీ రాజు మాట్లాడుతూ 'బయట కాదు.. గౌరవ ముఖ్యమంత్రి గారు అసెంబ్లీలోనే మాట్లాడారు. ముఖ్యమంత్రి గారు ఈ విధంగా మాట్లాడొద్దని అప్పుడు అబ్జక్షన్ చెప్పాలి కదా?' అని అన్నారు. 'అధికార పక్షానికి ఓ చట్టం, ప్రతిపక్షానికి ఓ చట్టం ఉన్నదా?.. అంబేద్కర్ ఆలా రాశారంటే నేనేం చేయలేను అధ్యక్షా' అంటూ తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఈ విధంగా కొద్దిసేపు మండలిలో చైర్మన్ వర్సెస్ శంభీపూర్ ఎపిసోడ్ కాక పుట్టించింది.

ఫోర్త్‌సిటీకి భూసేకరణ చేయలేదు: దుద్దిళ్ల

ఫోర్త్‌సిటీ అంశంలో మంత్రి శ్రీధర్‌బాబు వర్సెస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నట్టుగా కొనసాగింది. శంభీపూర్ రాజు అడిగిన ప్రశ్నలకు మంత్రి శ్రీధర్‌బాబు కాస్త తడబడుతూ సమాధానం చెప్పారు. 'ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీకి సంబంధించి ఇప్పటి వరకు భూమి లాక్కునే కార్యక్రమం, కార్యాచరణ జరగలేదు' అని తెలిపారు. 770 స్క్వేర్ కి.మీ పరిధిలో 56 గ్రామాలతో ఫోర్త్ సిటీ ఉండబోతున్నదని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో కొంత భాగంలోనే 8 ప్రముఖ ఫార్మా కంపెనీలు ఉత్పత్తిని ప్రారంభించబోతున్నాయని తెలిపారు. ఏ రైతుకు సంబంధించి కూడా ఇబ్బంది లేదని, భూమి కోల్పోయిన రైతులకు అన్ని విధాలా పరిహారం అందిస్తున్నామని చెప్పారు. కొత్తగా ఇంకేదో చేయాలనుకున్నప్పుడు భూసేకరణ చేస్తామని తెలిపారు. ప్రస్తుతం 770 స్క్వేర్ కి.మీ పరిధిలోనే ఉన్నదని, ఎలాంటి భూసేకరణ చేయలేదని మరోసారి స్పష్టంచేశారు.

భూసేకరణ చేయకుండా ఫోర్త్‌సిటీ ఎలా నిర్మిస్తారు?: శంభీపూర్

ఫోర్త్‌సిటీకి భూసేకరణ చేయలేదంటూ మంత్రి దుద్దిళ్ల ఇచ్చిన సమాధానంపై ఎమ్మెల్సీ రాజు మరోసారి ప్రశ్నలు సంధించారు. 'ఫ్యూచర్‌సిటీకి ల్యాండ్ అక్వేషన్ చేయలేదన్నారు.. మరి భూసేకరణ చేయకుండా ఫ్యూచర్ సిటీ ఎలా చేద్దామనుకుంటున్నారు?' అంటూ ప్రశ్నించారు. అంటే గత ప్రభుత్వం ఫార్మాసిటీకి కేటాయించిన భూమిని ఫార్మాసిటీకే కేటాయిస్తున్నారా? లేక ఆ భూమిని ఫ్యూచర్‌సిటీకి బదలాయిస్తున్నారా? అని ప్రశ్నించారు.

అవును.. రాజు చెప్పినట్టు.. అంత ఈజీ కాదు: మంత్రి దుద్దిళ్ల

కొత్త నగరం ఏర్పాటు అంత సులువు కాదన్న శంభీపూర్ రాజు అభిప్రాయంతో మంత్రి శ్రీధర్‌బాబు ఏకీభవించారు. ఆయన చెప్పిన అంశాన్ని అంగీకరించారు. 'రాజు చెప్పినట్టుగా కొత్త నగరం ఏర్పాటు అంత ఈజీ కాదు. ఇది డిఫికల్ట్ టాస్క్. బట్ వి టేక్ దట్ చాలెంజ్' అన్నారు.

రైతులకు భూమి వాపస్ ఇస్తున్నారా? లేదా?

ఫోర్త్‌సిటీ అంశంపై ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తన ప్రశ్నలతో ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టారు. 'మంత్రి శ్రీధర్‌బాబు ఫ్యూచర్ సిటీకి సంబంధించి ప్రణాళిక ఉన్నదని, ఆ ప్రకారమే ముందుకు వెళ్తున్నామని చెప్తున్నారు. మరి ఫోర్త్‌సిటీ కోసం ఇప్పటి వరకు ఏమైనా భూసేకరణ చేశారా? చేస్తే ఎన్ని ఎకరాలు చేశారు? రైతులకు ఏమైనా పరిహారం ఇచ్చారా? ఇస్తే ఏ విధంగా ఇచ్చారు?' అంటూ ప్రశ్నించారు. 'కరోనాకు వ్యాక్సిన్ అందించిన చరిత్ర మాది.. అందుకే మా ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ చాలా దూరదృష్టితో ఫార్మాసిటీ భూసేకరణ చేశారు. అప్పుడు ప్రస్తుత పీసీసీ అధ్యక్ష హోదాలో రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తే ఆ భూములను తిరిగి రైతులకు వాపస్ ఇస్తామని చెప్పారు. మరి ఇప్పుడు ఇస్తున్నారా? లేక అదే భూమిలో ఫ్యూచర్ సిటీ చేస్తున్నారా? లేక వేరే భూమిని సేకరిస్తున్నారా?' అని ప్రశ్నల వర్షం కురిపించారు. గతంలో భూసేకరణకు వ్యతిరేకంగా మాట్లాడిన ప్రస్తుత పాలకులు, ఇప్పుడు రైతులను ఊచలు లెక్కించి మరీ భూములు గుంజుకుంటున్నారని మండిపడ్డారు.

కొత్త సిటీ ఏర్పాటు అంత ఈజీ కాదు

ఫ్యూచర్ సిటీపై శంభీపూర్ రాజు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో కొత్త సిటీలు, కొత్త నగరాల ఏర్పాటు అనేది అంత ఈజీ కాదని, అది సాధ్యమయ్యే పని కూడా కాదని చెప్పారు. తాను ఇటీవల చైనాలో పర్యటించానని, అక్కడ గెస్ట్ సిటీ పేరుతో కొత్త నగరం ఏర్పాటు చేశారని తెలిపారు. కానీ అక్కడ ప్రజలు లేరని, ఇండస్ట్రీ లేదని చెప్పారు. ఈ విధంగా వాస్తవిక ఆలోచనలో ఉండాలని సూచించారు. 'అంతేగాని గత ప్రభుత్వం ఏదో చేసింది కాబట్టి పేరు మార్చుతాం అంటే ఎలా? పేరు కాదు ప్రజల ప్రమాణాలు మార్చండి' అని రాజు సూచించారు.

గుట్టు రట్టయితదనే కుట్ర

రైతుల సమస్యలు, 50 వేల కోట్ల భూముల తాకట్టు బాగోతం వెలుగులోకి రావొద్దని కుయుక్తి

అందుకే ప్రశ్నోత్తరాలను ప్రభుత్వం రద్దు చేసింది ● సమాధానాలు చెప్పలేక పారిపోయిన సర్కార్: హరీశ్‌రావు

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): రైతు సమస్యలు చర్చకొస్తే తమ బండారం బయటపడుతుందనే భయంతో కాంగ్రెస్ సర్కార్ కుట్ర చేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అందులో భాగంగానే అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలను రద్దు చేసిందని ధ్వజమెత్తారు. రైతుల పక్షాన తాము సంధించే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక శాసనసభ సాక్షిగా రేవంత్‌రెడ్డి సర్కార్ పారిపోయిందని ఎద్దేవాచేశారు. మంగళవారం అసెంబ్లీ లాబీల్లో హరీశ్‌రావు మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఆక్షేపించారు. ప్రతిపక్షం గొంతునొక్కి ప్రజా సమస్యలను పరిష్కరించకుండా ఉండటమే ప్రభుత్వ విధానంగా మారిపోయిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఖరి సరి కాదని స్పీకర్, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి, అసెంబ్లీ కార్యదర్శికి తమ అభ్యంతరాన్ని, అభిప్రాయాన్ని చెప్పామని తెలిపారు. ప్రశ్నోత్తరాలను ఎందుకు రద్దు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సభ్యులడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రశ్నోత్తరాలనే రద్దు చేయటం ఏమిటని ప్రశ్నించారు. సమావేశాల్లో జీరో అవర్ పెట్టినా పెట్టకపోయినా తప్పనిసరిగా ప్రశ్నోత్తరాలు పెట్టాల్సిందేనని స్పష్టంచేశారు.

రూ.50 వేల కోట్ల భూమి తాకట్టు బాగోతం

ప్రభుత్వం రూ.50 వేల కోట్ల భూమి తాకట్టు బాగోతం వెలుగులోకి వస్తుందనే ప్రభుత్వం ప్రశ్నోత్తరాలను రద్దు చేసిందని హరీశ్ దుయ్యబట్టారు. హెచ్ఎండీఏ భూములు తాకట్టు పెట్టి రూ.20 వేల కోట్లు, టీజీఐఐసీకి చెందిన భూముల నుంచి రూ.10 వేల కోట్లు, హెచ్ఎండబ్ల్యూఎస్ భూముల నుంచి రూ.10 వేల కోట్లు, జీహెచ్ఎంసీ ఆస్తులు తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్లు ఇలా మొత్తం రూ.50 వేల కోట్ల విలువైన భూమి, ఆస్తులను తాకట్టు పెట్టి అప్పు తెచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైందని చెప్పారు. దీనిపై ప్రశ్నోత్తరాల్లో కేటీఆర్ ప్రశ్న జాబితాలో ఉన్నదని, సమాధానం చెప్పాల్సి వస్తుందన్న భయంతోనే ప్రభుత్వం దాటవేసిందని మండిపడ్డారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవోలను వెబ్‌సైట్లల్లో పెట్టడం లేదని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో విఫలం

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్ ధ్వజమెత్తారు. కొనుగోలు కేంద్రాలను సకాలంలో ఏర్పాటు చెయ్యకపోవడం వల్ల రైతులు తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. తమ హయాంలో 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే ప్రస్తుత ప్రభుత్వం కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే కొనుగోలు చేసిందని వివరించారు. 'మేము 54 లక్షల మెట్రిక్ టన్నుల సన్నవడ్లు కొనుగోలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. వాస్తవానికి ఇప్పటివరకు 24 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసింది' అని వివరించారు.

ఎకరానికి 25 వేల పరిహారం ఇవ్వాలి

రాష్ట్రవ్యాప్తంగా పంటలు ఎండిపోవటానికి ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యమే కారణమని హరీశ్ మండిపడ్డారు. 'ఈ యాసంగిలో పంటలు ఎండిపోతున్నాయి. ప్రాజెక్టుల్లో నీళ్లున్నా ఎందుకు విడుదల చేయటం లేదు' అనే కేటీఆర్ ప్రశ్న ఉన్నదని, దీనిపై సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం చెప్పకుండా పారిపోయిందని ఎద్దేవాచేశారు. పంటలు ఎండిపోడానికి తమదే బాధ్యత అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంగీకరించిన విషయాన్ని గుర్తుచేస్తూ పంటలెండిన రైతులకు ఎకరానికి రూ. 25 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దేవాదుల కింద లక్షా 50 వేల ఎకరాల పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు ప్రభుత్వం 33 రోజులపాటు పంప్‌లు ఆన్ చేయకపోవటమే కారణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేవాదులతో పాటు మల్లన్నసాగర్ ప్రాజెక్టులో నీళ్లున్నా విడుదల చేయకపోవడం వల్ల దుబ్బాక నియోజకవర్గంలో పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు.

రుణమాఫీలేదు..రైతుబంధు వేయలే

రుణమాఫీ కోసం రైతులు ఎదురుచూస్తున్నారని హరీశ్ తెలిపారు. వానాకాలం, యాసంగి పంటకాలాల్లో రైతుభరోసాపై ప్రభుత్వం దాటవేస్తున్నదని చెప్పారు.రుణమాఫీ పూర్తయిందని సీఎం, మంత్రులు పదేపదే చెప్తున్నారని, వాస్తవానికి రాష్ట్రవ్యాప్తంగా కనీసం 50 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదని తెలిపారు. సిద్దిపేటలో మొత్తం 43,363 మంది రైతులుంటే వారిలో 22,949 మంది రైతులకే రుణమాఫీ అయ్యిందని, 20,514 మంది రైతులకు మాఫీ కాలేదని వివరించారు. రైతుభరోసా రూ. 39 కోట్లు మాత్రమే రైతులకు చేరిందని, ఇంకా రూ. 37 కోట్లు వేయలేదని వివరించారు. ఆంధ్రప్రదేశ్ జలదోపిడీ కారణంగా మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో పంటలు ఎండిపోతున్నాయని హరీశ్ ఆవేదన వ్యక్తం చేశారు.

జీతాల కోసం రోడ్డెక్కాల్నా?

ఉద్యోగులకు జీతం కావాల్నంటే రోడ్కెక్కాల్సిందేనా? అని హరీశ్ ప్రశ్నించారు. నిమ్స్ సెక్యూరిటీ సిబ్బంది వేతనాలపై మంగళవారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. నిమ్స్ సెక్యూరిటీ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు చెల్లించకుండా, వారిని కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డెక్కే దుస్థితికి నెట్టిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఎంతో అంకిత భావంతో దవాఖానలో రాత్రింబవళ్లు సేవలందిస్తున్న సిబ్బంది ప్రతి నెలా జీతాల కోసం చేతులు జోడించి అడగాల్సి వస్తున్నదని, రోడ్డెక్కి పోరాటం చేస్తే తప్పా ప్రభుత్వం జీతాలు చెల్లించడం లేదని చెప్పారు. ఉద్యోగుల కష్టాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు తియ్యటి మాటలు, ఇప్పుడేమో తీవ్ర నిర్లక్ష్యం కాంగ్రెస్ మోసపూరిత పాలనకు నిదర్శనమని విమర్శించారు. కష్టజీవుల న్యాయమైన హక్కులను కాలరాస్తూ, వారి కుటుంబాలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి న్యాయమా? అని ప్రశ్నించారు. నిమ్స్ సెక్యూరిటీ సిబ్బందికి జీతాలు వెంటనే విడుదల చేయాలని, మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా ప్రతినెల 1వ తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

రైతు సమస్యలు పరిష్కరించకుండా సర్కార్ పరార్

రైతు సమస్యలపై సంధించే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక ప్రభుత్వం పారిపోయిందని హరీశ్‌రావు ఆరోపించారు. నీళ్లులేక పంటలు ఎండుతున్నాయన్నారు. ఆందోళన చెందుతున్న రైతులు అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం ధైర్యాన్ని ఇస్తుందని ఆశిస్తే వారికి నిరాశే ఎదురైందని ఆయన ఆవేదన చెందారు. ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యం వల్లనే పంటలు ఎండుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీటి సమస్యతోపాటు రైతుభరోసా, రుణమాఫీ, ధాన్యం కొనుగోలు వంటి ముఖ్యమైన రైతు సమస్యలపై తాము ప్రశ్నోత్తరాల్లో ప్రభుత్వం దృష్టికి తెద్దామని సిద్ధమయ్యామని వివరించారు. తనతోపాటు ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గంగుల కమలాకర్ బీఆర్ఎస్ నుంచి సభ దృష్టికి తెచ్చి తద్వారా సమాధానం వస్తుందని ఆశిస్తే వాటికి సమాధానం ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతో ప్రభుత్వం పారిపోయిందన్నారు.

ప్రశ్నోత్తరాల ఎత్తివేతపై బీఆర్ఎస్ అసంతృప్తి

- అసెంబ్లీ జరుగుతున్నా ప్రొటోకాల్ పాటించరా?
- జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ ఎత్తేయండి
- స్పీకర్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల భేటీ

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు భేటీ అయ్యారు. మంగళవారం అసెంబ్లీ ప్రాంగణంలోని స్పీకర్ చాంబర్‌లో ఆయనను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, గంగుల కమలాకర్, కేపీ వివేకానంద, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కోవ లక్ష్మి, పాడి కౌశిక్‌రెడ్డి, విజయుడు తదితరులు కలిశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రశ్నోత్తరాలను ఎత్తివేయటం అన్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరారు. ఒకవైపు శాసనసభ సమావేశాలు జరుగుతున్నప్పటికీ మరోవైపు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకులే అధికారిక కార్యక్రమాలను నిర్వహించడంపై నిరసన వ్యక్తంచేశారు. సమావేశాలు సాగుతున్న సమయంలోనూ ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతున్నదని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి స్పీకర్ దృష్టికి తెచ్చారు. ఈ ఉల్లంఘనలపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు.

తక్కువ ప్రశ్నలడగండి.. హరీశ్ వెంటపడతరు!

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): సభ్యులు ఎక్కువ సమస్యలు లేవనెత్తుతుండటంతో స్పీకర్ ప్రసాద్‌కుమార్.. 'మీరు చాలా తక్కువగా ప్రశ్నలు అడగండి. మంత్రులు త్వరగా సమాధానం చెప్తరు. లేకపోతే హరీశ్ సమాధానం ఎక్కడ? అని మా వెంట పడతరు' అని చెప్పడంతో బీఆర్ఎస్ పక్షంలో నవ్వులు విరిశాయి.

కేంద్రం నిధులివ్వకున్నా సరే!

మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : మూసీ సుందరీకరణ పనులు, మెట్రో రైలు ప్రాజెక్టుల కోసం కేంద్రం నిధులు ఇవ్వకపోయినా పూర్తి చేసి తీరుతామని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టంచేశారు. 'సుచిత్ర–కొంపల్లి, అల్వాల్–శామీర్‌పేట ప్రాంతాల మెట్రో వివరాలు ఏవి?' అంటూ ఎమ్మెల్సీ కవిత అడిగిన ప్రశ్నకు మంత్రి శ్రీధర్‌బాబు సమాధానమిచ్చారు.

రాజధానికి ట్యాంకర్లతో నీళ్లు

మంత్రి పొన్నం

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నగరంలో 24 గంటల పాటు ట్యాంకర్లతో మంచి నీటి సరఫరా చేస్తున్నామని శాసనమండలిలో మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో నీటి ఎద్దడి అంశంపై మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ తాతా మధు లేవనెత్తిన పొన్నం సమాధానమిచ్చారు. ట్యాంకర్ నీరు కొనాలంటే రూ.10 వేలు చెల్లించాల్సి వస్తుందని ఎమ్మెల్సీ కవిత చెప్పగా పొన్నం అలాంటిదేమీ లేదన్నారు.

అసెంబ్లీ ఎదుట బీజేపీ ఎమ్మెల్యేల నిరసన

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఆవరణలో నిరసనకు దిగారు. మంగళవారం బీజేపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో ఏలేటి మహేశ్వర్ రెడ్డిని అరెస్టు చేశారు.

3 బిల్లులకు శాసనమండలి ఆమోదం

హైదరాబాద్, మార్చి 18 (నమస్తేతెలంగాణ): విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ, దేవాదాయ, ధర్మాదాయ, వైటీడీఏ బోర్డు బిల్లులు శాసనమండలిలో మంగళవారం ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. అనంతరం సభ బుధవారానికి వాయిదా పడింది.

తాగునీళ్లు లేవు.. సాగునీళ్లు రావు!

- సాగునీళ్లిచ్చి పంటలు కాపాడండి
- మిషన్ భగీరథతో దూప తీర్చండి
- కరెంటు కోతలతో ఇక్కట్లు
- రైస్ మిల్లులు నడుస్తలేవు
- సమస్యలతో హోరెత్తిన అసెంబ్లీ
- ఏకరువు పెట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- గంగుల మాట్లాడుతుండగా మైక్ కట్.. బీఆర్ఎస్ ఫైర్

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): 'మా ప్రాంతంలో మంచినీళ్లు రావడం లేదు.. మా దగ్గర సాగునీళ్లు పారడం లేదు.. మా నియోజకవర్గంలో కరెంట్ కోతలతో సతమతమవుతున్నాం.. రైస్ మిల్లులు నడవడం లేదు.. మా ఏరియాలో మిషన్ భగీరథ బంద్ అయింది.. తాగునీటి కోసం ప్రజలు తండ్లాడుతున్నరు.. మా ప్రాంతంలో పచ్చని పంటలు ఎండుతున్నయ్..' ఇలా తాగు, సాగునీటి సమస్యలతో మంగళవారం అసెంబ్లీ హోరెత్తింది. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 26 మంది ఎమ్మెల్యేలు వ్యవసాయ సంక్షోభంపై ఫైరయ్యారు. తాగు, సాగునీటి సమస్యతోపాటు కరెంటు ఇక్కట్లపై గగ్గోలు పెట్టింది ప్రతిపక్ష సభ్యులు కాదు.. అసెంబ్లీ సాక్షిగా సర్కారు తీరును ఎండగట్టింది అధికార పార్టీకి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు. రైతులు ఆందోళనకు సిద్ధమవుతుండగా, ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టు చేస్తున్నారని, తక్షణమే యుద్ధప్రాతిపదికన తాగు, సాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం అసెంబ్లీ ప్రారంభం కాగానే జీరో అవర్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్ అనుమతి ఇచ్చారు. తాగు, సాగునీరు, కరెంటు, కాల్వల మరమ్మతు సమస్యలతో అసెంబ్లీ దద్దరిల్లింది.

మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు: రాజగోపాల్‌రెడ్డి

మిషన్ భగీరథ బంద్ అయిందని, ప్రజలకు తాగునీరు అందడం లేదని అధికార కాంగ్రెస్‌కు చెందిన మునుగోడు ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తంచేశారు. 'ప్రపంచంలో అత్యధిక ఫ్లోరైడ్ ఉన్న ప్రాంతం మా మునుగోడు నియోజకవర్గం. ఎండల తీవ్రత వల్ల నారాయణపూర్, చౌటుప్పల్ మండలాల్లో భూగర్భ జలాలు పడిపోయి పంటలు ఎండిపోతున్నాయి. రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటికి కూడా కటకట ఏర్పడింది. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చింది. వేల కోట్లతో ఫైలాన్ కట్టిన చౌటుప్పల్ పట్టణంలోనే ఇప్పుడు మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. 2011 జనాభా లెక్కల ప్రకారం చౌటుప్పల్ పట్టణానికి తాగునీటి కేటాయింపులు జరిగాయి. అక్కడి పరిశ్రమల వల్ల జనాభా పెరిగింది. జనాభా ప్రాతిపదికన నీటి కేటాయింపులు లేవు. తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సత్యరమే తాగునీటి సమస్యను పరిష్కరించాలి' అని రాజగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు.

మంచినీళ్లు రావడం లేదు: మాధవరెడ్డి

నర్సంపేట నియోజకవర్గంలోని పలు గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్లు అందడం లేదని నర్సంపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే మాధవరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. కొన్ని చర్యలు తీసుకొంటే నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నా అధికారులు స్పందించడం లేదని పేర్కొన్నారు. పాకాల చెరువు కాల్వల మరమ్మతులు చేస్తే చివరి అయకట్టుకు సాగునీరు అందుతుందని, వేసవిలో మరమ్మతులు చేసేందుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

కరెంట్ కోతలతో రైస్ మిల్లులు నడుస్తలేవు

బత్తుల లక్ష్మారెడ్డి ఆవేదన

అప్రకటిత విద్యుత్తు కోతలతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని మిర్యాలగూడ కాంగ్రెస్ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కరెంటు కోతలు విధిస్తున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. మిర్యాలగూడ ప్రాంతంలో రైస్ మిల్లులు ఎక్కువగా ఉన్నాయని, కరెంట్ కోతలతో మిల్లులు నడుస్తలేవని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. డిప్యూటీ సీఎం విద్యుత్తు శాఖ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విన్నవించారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్యను తీర్చాలని కోరారు. వాడపల్లి దేవాలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో లింకు రోడ్లకు నిధులు ఇవ్వాలని కోరారు.

చెరువుకు రూ.102 కోట్లివ్వండి: గండ్ర

భీమ్‌గణపూర్ చెరువును అభివృద్ధి చేయాలని భూపాలపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు